ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
సోమవారం 5 ఫిబ్రవరి 2024

పరిహారం కోసం పడిగాపులు
- 15 ఏళ్లుగా మిడ్‌మానేరు నిర్వాసితుల నిరీక్షణ 7

అబద్ధాల పునాదులపై
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు 8

నెర్రెలుబారిన పొలాలు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- జిల్లాలో వేసవికి ప్రమాద ఘంటికలు
- ఇప్పటికే 8.70మీటర్లకు పడిపోయిన జలాలు
- జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో వరినాట్లు


అనంతగిరిలో ఎండిన పొలం
నీరు తగ్గుతున్న అన్నపూర్ణ ప్రాజెక్టు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వేసవికి ముందే అన్నదాతలకు నీటికష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే వేగంగా భూగర్భ జలాలు పడిపోతున్నాయి. జిల్లాలో కొన్ని చోట్ల పొలాలు నీళ్ల లేక నెర్రెలు బారాయి. జిల్లాలో ఇప్పటికే 8.70 మీటర్ల లోతులోకి నీళ్లు చేరాయి. గత సంవత్సరం జనవరితో పోల్చుకుంటే భూగర్భ జలాల్లో 2.27 మీటర్ల వ్యత్యాసం ఏర్పడింది. గత సంవత్సరం జనవరిలో 6.43 మీటర్లలో నీటి లభ్యత ఉంటే ఈ సంవత్సరం 8.70 మీటర్లకు పడిపోయింది. భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో యాసంగి పంటలపై ప్రభావం మొదలైంది. జిల్లాలో 1.75 లక్షల ఎకరాల్లో యాసంగి సాగుకు రైతులు సిద్ధమై 1.71 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి 1.68 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. మొక్కజొన్న 1,217 ఎకరాలు, జొన్న 2.12 ఎకరాలు, కందులు 205 ఎకరాలు, అముదం 6.06 ఎకరాలు, బబ్బెర్లు 24.03 ఎకరాలు, పెసర 48.18 ఎకరాలు, వేరుశెనగ 22.11 ఎకరాలు, ఆవాలు 13.35 ఎకరాలు, నువ్వులు 194 ఎకరాలు, పొద్దు తిరుగుడు 745 ఎకరాలు, గోధుమ 99.12 ఎకరాలు, చెరకు 24 ఎకరాల్లో సాగు చేశారు. వీటితో పాటు ఇతర పంటలు వేసుకున్న రైతులకు భూగర్భ జలాలపై ఆందోళనలు ఏర్పడ్డాయి.

● వట్టిపోతున్న ప్రాజెక్టులు

సాగునీటికి రైతుల ఆందోళన

యాసంగి సీజన్‌కు కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి నీళ్లు వచ్చేపరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు జిల్లాలో ఉన్న ప్రాజెక్టుల్లో నీటి శాతం తగ్గిపోయి ప్రాజెక్టులు వట్టిపోతున్నాయి. తాగునీటి కష్టాలు ఎలా ఉన్నా ప్రాజెక్టుల్లో నీళ్లు లేకపోవడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27.5 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 16.73 టీఎంసీలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా అన్నపూర్ణ ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోయాల్సి ఉంది. 3.50 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో నీటిని రంగనాయక సాగర్‌కు మళ్లించడంతో ఒక టీఎంసీ కూడా పూర్తిగా లేకపోవడంతో ప్రాజెక్టు అడుగంటి పోయింది. ప్రాజెక్టు కింద ఉన్నా వరిపొలాలు ఇప్పటికే నెర్రెలు తెరిచాయి. 300 ఎకరాలకు పైగా పొలాలు నీళ్లు అందక ఎండిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సమయంలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ నుంచి కూడెల్లి వాగుద్వారా జిల్లాలోని ఎగువ మానేరు ప్రాజెక్టులోకి నీటిని మళ్లించేవారు. ప్రస్తుతం ఆపరిస్థితి కూడా లేకపోవడంతో 32 ఫీట్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 22 ఫీట్ల వరకు నీళ్లు ఉన్నాయి. యాసంగి సీజన్ ప్రారంభంలోనే నీటి ఇబ్బందులను రైతులు ఎదుర్కుంటుండడంతో మరో నెల తరువాత పరిస్థితులు ఎలా ఉంటాయోననే ఆందోళనలు జిల్లాలో నెలకొన్నాయి.

జిల్లాలో రైతులు బోరు బావులపైనే ఆధారపడి సాగు చేస్తూ వస్తున్నారు.

ప్రస్తుతం భూగర్భ జలాలు పడిపోతుండడంతో బోరు బావుల్లో నీటి లభ్యత తగ్గుతూ వస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 73,735 బోరుబావులు ఉన్నాయి. సిరిసిల్లలో 2,243, కోనరావుపేటలో 7,688, తంగళ్లపల్లిలో 8,369, ఇల్లంతకుంటలో 9,255, వేములవాడలో 1,058, వేములవాడ రూరల్‌లో 701, బోయినపల్లిలో 6,558, చందుర్తిలో 7,793, ఎల్లారెడ్డిపేటలో 10,854, ముస్తాబాద్‌లో 7,766, గంభీరావుపేటలో 6,350 బోరు బావులు ఉన్నాయి. వీటి ఆధారంగా పంట పొలాలకు నీళ్లు అందిస్తున్న నీటి లభ్యత పడిపోతుండడంతో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. యాసంగి సీజన్‌లో రైతులు సజావుగానే నాట్లు, ఇతర పంటలకు విత్తనాలు వేసుకోవడం, ఇబ్బందులు లేకపోయినా భూగర్భ జలాలపైనే ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 2023లో జనవరిలో 6.43 మీటర్లు, ఉన్నా భూగర్భ జలాలు ఈ సంవత్సరం 8.70 మీటర్లకు పడిపోయింది. భూగర్భ జలాలు ఎక్కువగా పడిపోయిన వాటిలో అత్యధికంగా జిల్లాలో ఎల్లారెడ్డిపేటలో 13.87 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. ఇదే వరుసలో సిరిసిల్ల, ముస్తాబాద్, గంభీరావుపేట, వేములవాడ, వీర్నపల్లి, ఇల్లంతకుంట, చందుర్తి మండలాల్లో వేగంగా భూగర్భ జలాలు పడిపోతున్నాయి.

బావిలో పూడికలు తీస్తున్నాం

- మామిండ్ల రవి, రైతు అనంతగిరి



బావుల్లో నీరు పూర్తిగా తగ్గిపోవడంతో పూడికలు తీస్తున్నాం. ఇప్పటికే ఎకరం పైగా వరిచేను ఎండిపోయింది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని నింపుతేనే పంట చేతికి వస్తుంది. పెట్టుబడులకు కూడా ప్రభుత్వం ఆదుకోవాలి.

జిల్లాలో మండలాల వారీగా భూగర్భ జలాలు (మీటర్ల లోతులో)

మండలం	గత సంవత్సరం జనవరి	ప్రస్తుతం
బోయినపల్లి	5.25	5.78
చందుర్తి	4.66	5.90
గంభీరావుపేట	6.53	9.07
ఇల్లంతకుంట	4.67	6.45
కోనరావుపేట	6.82	8.63
ముస్తాబాద్	7.28	10.49
రుద్రంగి	5.71	6.01
సిరిసిల్ల	8.05	11.82
తంగళ్లపల్లి	6.26	8.05
వీర్నపల్లి	10.19	12.56
వేమువలాడ రూరల్	3.80	4.48
వేములవాడ	9.87	12.20
ఎల్లారెడ్డిపేట	7.93	13.87
సరాసరి	6.43	8.70

నేడు కొబ్బరికాయల అమ్మకాల వేలంపాట

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 4: మండలకేంద్రంలో జరిగే సమ్మక్కసారలమ్మల జాతన సందర్భంగా కొబ్బరికాయల అమ్మకాలకు సోమవారం వేలంపాట జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మక్కసారలమ్మ జాతన ఈనెల 21నుండి మూడు రోజులపాటు కొనసాగుతుందని, అన్ని గ్రామాల భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యుల ఆత్మీయ సమ్మేళనం

ముస్తాబాద్, ఫిబ్రవరి 4: దాదాపు యాభై యేళ్ల తరువాత డాక్టర్స్ అంతా ఒక్క చోట చేరి జ్ఞాపకాలు పంచుకొని చిన్నారులయ్యారు. కాకతీయ యునివర్సిటీలో 1975లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న డాక్టర్లంతా ఒక్క చోట చేరి ముస్తాబాద్‌లోని ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతోజు శంకర్ ఆధ్వర్యంలో ఒక్క చోట చేరారు. స్థానిక మాతృశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాట చేశారు. చిన్నప్పటి మధుర స్మృతులను పంచుకున్నారు. పొద్దంతా ఆనందోత్సాహాల మధ్య గడిపి చిన్నపిల్లలు అయ్యారు. వీరి బ్యాచ్‌మెట్ ఐపీఎస్‌గా ఎంపికైన నిజామాబాద్‌కు చెందిన రాజేంద్రకుమార్ జమ్ము కాశ్మీర్‌లో డీఐజీగా పనిచేసి పదవీ విరమణ పొందారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా పాల్గొని దేశం ఔన్నత్యం కోస యువత శ్రమించాలన్నారు. దేశాభివృద్ధికి యువతే కీలకమని మద్యం మత్తులో పడొద్దని సోమరితనాన్ని వీడి శ్రమ జీవానానికి అలవాటు పడాలన్నారు. సమాయాన్ని వృధా చేయొద్దని మన దేశంలో విలువైన సహజ వనరులు, సంపదలున్నాయన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వివేకానంద్, డాక్టర్ దయాకర్, విజయ్, విశ్రుత్, చింతోజు భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం

- ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ/వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4: నూతనంగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిసారించారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో రజక సంఘం భవనాన్ని ప్రారంభించి, పట్టణంలో మున్నూరు కాపు నిత్యన్నదాన సత్రం వార్షికోత్సవ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకువెళ్లేందుకు సీఎం ప్రత్యేక దృష్టిసారించారని అన్నారు. అన్ని కులాలకు ప్రాధాన్యాన్ని కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. మున్నూరుకాపుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం తరుపున సహాయసహకారాలు అందిస్తామని, త్వరలో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పద్మశాలి సేవాసంస్థన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో తనకు మద్దతునిచ్చిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా తనపై చూపిన ప్రేమకు ప్రతీఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. పద్మశాలి సేవాసంస్థన్ కమ్యూనిటీ అంతస్తు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వేములవాడ పట్టణంలోని ఆర్యవైశ్య వాసవి నిత్యన్న సత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగిన మురళి కాంస్య విగ్రహాన్ని ప్రారంభించారు. అర్బన్ మండలంలోని గుర్రంవానిపల్లి, చంద్రగిరి, చీర్లవంచ గ్రామాల్లో కృతజ్ఞత ర్యాలీలో పాల్గొని నిర్వాసితులను ఉద్దేశించి మాట్లాడుతూ నిర్వాసితులకు మిగిలిపోయిన పరిహారం, పట్టాలను త్వరలోనే అందిస్తామని అన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సంఘ హన్మవ్వ, వేములవాడ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, మున్నూరుకాపు సంఘం జాతీయ నాయకులు కొండ దేవయ్య, నాయకులు సంఘం స్వామియాదవ్, పిల్లి కనుకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు, ముడికే చంద్రశేఖర్‌యాదవ్, పండుగ ప్రదీప్, కదిరే రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.




శాత్రాజుపల్లిలో రజక భవనాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, వేములవాడలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్

● ప్రజాక్షేత్రంలో ఉండాలనుకుంటున్నా...

- మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు

ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాజీవితంలోకి రావాలనుకుంటున్నానని రాష్ట్ర మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావు అన్నారు. వేములవాడలో నిర్వహించిన మున్నూరుకాపు సత్రం వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఇప్పటికే కొత్తగూడెంలో ట్రస్టు ఏర్పాటు చేసి సేవలను అందిస్తున్నానని అన్నారు. ఎన్నో యేళ్ల చరిత్ర చూసిన జాతి అని, అస్తిత్వాన్ని కాపాడుకునేది మున్నూరుకాపు కులమే అని వాళ్లే పరిపాలించే సత్తా కులానికి ఉందని సగర్వంగా నమ్ముతున్నానని తెలిపారు. ఖమ్మం, సికింద్రాబాద్ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వాతావరణం వున్న పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. ఎంపీగా పోటీచేసే అన్ని అర్హతలు తనకు ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తనను గుర్తిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మోదీ, ఆడ్వాణీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో చలో బస్తీ..చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా భారత రత్న అవార్డు పొందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కె అడ్వాణీ, ఆయోధ్యలో రామమందిర నిర్మాణానికి సహకరించడంతో పాటు భారతరత్న అవార్డు ఇచ్చిన భారత ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలకు తంగళ్లపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలో బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి గూడురి భాస్కర్, నాయకులు కాశీచరణ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంతరాలు లేని విద్య ప్రజల హక్కు

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 4: అంతరాలు లేని విద్యా ప్రజల హక్కుతో పాటు ప్రభుత్వ బాధ్యత అని ప్రభుత్వం కామన్ స్కూల్ విద్యా విధానాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలని టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఆదివారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మం పట్టణంలో ఈ నెల 11, 12వ తేదీల్లో టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్య, వైజ్ఞానిక మహాసభలను నిర్వహిస్తున్నామని దీనికి ఉపాధ్యాయులు, మేధావులు విద్యాభిమానులు, హాజరు కావాలని కోరారు. ఈ మహాసభలో నూతన జాతీయ విద్యా విధానం, రాజ్యాంగ విలువలు, ఫాసిజం, బుద్ధి జీవుల పాత్ర, మహిళల స్థితిగతులు, కర్తవ్యాలు, ప్రభుత్వ విధానాలు, ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ పరిస్థితులు ఫలితాలు, ప్రభావాలు అనే అంశాలపై ప్రొఫెసర్లు బుర్ర రమేష్, చింతకింది కాశీం, చందనచక్రవర్తి, వేణుగోపాల్, నర్సింహారెడ్డి, ప్రసాద్ ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే హరగోపాల్, కోదండరాంలతో పాటు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మల్లు రవి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రాంనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఈసీ కమిటీ సభ్యులు ఉమాబాలచందర్‌రాజు, రాష్ట్ర కౌన్సిలర్లు గుజ్జునేని వేణుగోపాల్‌రావు, పూరెల్లి రవీందర్, పంజాల వెంకటేశ్వర్లు, పురం వాసుదేవరావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, హన్మాండ్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

- లోన్, లాటరీ పేరుతో వచ్చే మెసేజ్‌లకు మోసపోవద్దు - ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 4: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. జిల్లాలో వారం రోజులుగా జరిగిన సంఘటన వివరాలను ఎస్పీ ఆదివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ లోన్, లాటరీ పేరుతో వచ్చే మెసేజ్‌లకు మోసపోవద్దన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని, ఎన్‌సిఆర్‌పి పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందిస్తారన్నారు. బ్యాంకు ఖాతాలతో ఫోన్ నెంబర్‌లు అనుసంధానం కావడంతో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొని చాలామంది నగదు రహిత లావాదేవీలు చేస్తున్నారన్నారు. ఓ వైపు డిజిట్ లావాదేవీలు విస్తరిస్తుండగా అంతేవేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రధానం గా వస్తువులు అతితక్కువ ధరకు లభిస్తాయనే ప్రకటనలు చూసి ఆ లింకులు క్లిక్‌చేసి మోసపోతున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు వారి మొబైల్ నెంబర్ ఆధానరంగా బ్యాంకులో ఉన్న డబ్బును ఖాళీచేస్తున్నారన్నారు. ఆ తర్వాత బాధితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విధంగా మీకు లాటరీ వచ్చిందని, కాల్, మెసేజ్ వస్తే స్పందించవద్దన్నారు. లాటరీ పేరుతో సైబర్‌గాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపరిచిత వ్యక్తుల నుండి వచ్చే వీడియో కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, మీకు వచ్చిన వీడియోకాల్ రికార్డుచేసి బెదిరించి డబ్బులు లాగేస్తున్నారన్నారు. వేలల్లో పెట్టుబడి లక్షల్లో లాభాలు అంటూ నిమ్మించి ఇచ్చే వాట్సప్, టెలిగ్రామ్ మెసేజ్‌లను నమ్మవద్దన్నారు. మీకు ఉద్యోగం ఇస్తామం అంటూ మెసెజ్‌లు చేస్తే స్పందించవద్దన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లోనూ మీకు తెలిసిన వ్యక్తి ఫోటో పెట్టి డబ్బులు పంపమని అడిగినా పట్టించుకోవద్దన్నారు.

● వారంలో సైబర్ మోసాలివే..

జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం రోజుల్లో చోటుచేసుకున్న సైబర్ మోసాలు ఈ విధంగా ఉన్నాయి. వేములవాడ పట్టణానికి చెందిన ఓ బాధితుడికి వాట్సప్‌లో ఒక మెస్సెజ్ వచ్చింది. ఈ మెసేజ్‌ను నమ్మిన బాధతుడు 1.14లక్షలు బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాడు.

బోయిన్‌పల్లి మండలంలోని ఓ బాధితుడికి క్రెడిట్ కార్డు పేరిట ఓ లింక్ రావడతో అది ఓపెన్‌చేసిన బాధితుడు రూ. 30వేలు కోల్పోయాడు. గంభీరావుపేట మండలంలో ఓ బాధితుడికి పాన్ కార్డు లింక్ కోసం వాట్సాప్ మెసెజ్ రావడంతో స్పందించి ఆ లింక్ ఓపెన్‌చేయగా క్రెడిట్‌కార్డు వివరాలు షేర్‌చేయడంతో రూ. 14వేలు నష్టపోయాడు. ఇదే విధంగా ఎల్లారెడ్డిపేటలోనూ ఓ బాధితుడు క్రెడిట్‌కార్డు వివరాలు షేర్‌చేసి రూ.98వేలు కోల్పోయాడు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

గంజాయి విక్రయించిన యువకుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 4: సిరిసిల్ల పట్టణం కార్గిల్‌లేక్ వద్ద గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేశమని టౌన్ సీఐ రఘుపతి ఆదివారం తెలిపారు. పట్టణంలోని రాజీవనగర్‌కు చెందిన సీహెచ్ రవికుమార్ (24) అనే యువకుడు కార్గిల్ లేక్ వద్ద మరో యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై 177 గ్రాముల గంజాయి విక్రయానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నామని ఆయన తెలిపారు. మరో యువకుడు పరారయ్యాడన్నారు. రవికుమార్ వద్ద గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు .

ఒబులాపూర్‌లో రెండిళ్లలో చోరీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 4: తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ గ్రామంలో రెండిళ్లలో చోరీ జరిగింది, గ్రామానికి చెందిన పోచంపెల్లి బాలకిషన్ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా గుర్తుతెలియని దుండగులు తాళం పగల గొట్టి రూ. 40వేల నగదుతో పాటు ఆర తులం బంగారం, 5 తులాల వెండి ఆభరణాలు ఎత్తు కెళ్లారు. అలాగే పోచంపెల్లి పోచవ్వ ఇంటి తాళం పగలగొట్టి రూ. 7500 నగదుతో పాటు పావుతులం బంగారం ఎత్తు కెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నర్సాపూర్ అసెంబ్లీ ప్రభారీగా మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్, ఫిబ్రవరి 4: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీగా ముస్తాబాద్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదివారం నియమించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ నాయకుల పనితీరు, ప్రజలకు ఏం చేయాలి, ఎటు వైపు ఉన్నారు అనే పలు అంశాలపై రాష్ట్ర కమిటీకి రిపోర్టు చేస్తారు. ఎన్నికల్లో గెలిచేలా రాష్ట్ర కమిటీకి పలు సూచనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని మహిళపై దాడికి పాల్పడిన ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని షేక్ అహ్మద్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని మహిళా అలీమా, షేక్ అహ్మద్ కుటుంబంతో గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న మహిళపై సోషల్ మీడియాలో అసభ్యకర వాయిస్ మెసేజ్ పోస్ట్ చేశాడని చెప్పారు. ఎందుకు అసభ్యకరంగా వాయిస్ మెసేజ్ పోస్ట్ చేశావని పేర్కొంటూ మహిళా షేక్ అహ్మద్‌ను నిలదీయడంతో ఆగ్రహించిన ఆయన ఇనుప చువ్వతో తలపై దాడికి చేశాడని పేర్కొన్నారు. అంతటితో ఆగని ఆయన చంపుతానని బెదిరించాడని తెలిపారు. బాధితురాలు అలిమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

రైతుపై ఎలుగుబంటి దాడి

- ఛిద్రమైన ముఖభాగం - పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: మండలంలోని దేవునిగుట్ట తండాలో గుగులోతు హరిలాల్ అనే రైతుపై ఎలుగుబంటి ఆదివారం దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హరిలాల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్న తన వ్యవసాయ పొలం వద్దకు ఆదివారం ఉదయం వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివస్తుండగా చెట్ల పొదల్లో నుంచి ఎలుగుబంటి ఒక్కసారిగా దాడికి పాల్పడడంతో రైతు హరిలాల్ ముఖభాగం పూర్తిగా ఛిద్రమైంది. రెండు కళ్లు బయటకు వచ్చి నుదురు, తలభాగం తీవ్రంగా దెబ్బతిన్నది. హరిలాల్ కేకలు విని సమీపంలో ఉన్న ఉన్న ప్రజలు అక్కడికి వచ్చి ఎలుగుబంటిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు. తీవ్రంగా గాయపడ్డ హరిలాల్‌ను మండల కేంద్రంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి పరిస్థితి విషమం, ఆసుపత్రికి తరలింపు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేము లవాడ పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిగిత్యాలకు చెందిన మహేష్(25) అనే యువకుడు తన మిత్రులు వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీకి చెందిన ప్రమోద్, తేజ ఇంటికి వచ్చాడు. ప్రమోద్, తేజ కుటుంబాలు వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ సమీపంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద విందు ఏర్పాటు చేశారు. విందుకు హాజరైన ముగ్గురు యువకులు తిరిగి ఒకే ద్విచక్రవాహనంపై వేములవాడకు వస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల సమీపంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టా రు. ఈ సంఘటనలో జగిత్యాలకు చెందిన మహేష్ (25) అక్కడికక్కడే మృతి చెందగా ప్రమోద్, తేజకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కరీంనగర్ తరలించినట్లు స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మంథనిరూరల్, ఫిబ్రవరి 4: మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన చంద్రయ్య(50) అనే రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆదివారం మృతిచెందాడు. చంద్రయ్య పొలం వద్దకు బైక్‌పై వెళ్లాడు. పని పూర్తి చేసుకుని మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి మీదకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 4: జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలని సైకాలజిస్ట్ రవికాంత్ అన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వెంటాడుతున్న మొగి పురుగు

- తెగులు ఉధృతికి ఎర్రబారుతున్న పొలాలు
- దిగుబడిపై ప్రభావం
- నాట్లు వేసిన పదిహేను రోజుల నుంచే పంటను ఆశిస్తున్న పురుగు
- ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు



జిల్లాలో మొగిపురుగు సోకిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వరి రైతును మొగి పురుగు వెంటాడుతోంది. గత యాసంగిలో సోకినట్లుగానే ఈ సీజన్‌లో సైతం వరి పంటలను మొగి పురుగు ఆశిస్తోంది. భారీ వర్షాల కారణంగా వానాకాలం వరి పంట అన్నదాతకు నష్టాలే మిగి ల్చింది. ఎన్నో ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులకు ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. ఈ యేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాయి. దీనికి తోడు కాలువల ద్వారా సాగు నీరు అందిస్తుండడంతో రైతులు యాసంగిలో ముమ్మరంగా వరి నాట్లు వేశారు. వేసిన 15 రోజుల్లోనే వరిలో మొగి పురుగు సోకి కాండం కుళ్లిపోతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో అక్కడక్కడ మొగి పురుగు సోకుతోందని నిపుణులు అంటున్నారు. తెగులు ఉధృతికి పంట ఎర్రబారుతోందని అన్నదాతలు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ సమా చారం ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో వరి సాగు సుమారు 30.43 లక్షల ఎకరాల్లో ఉండగా అందులో జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 2,69,817 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. వరి పైర్లు కొన్ని చోట్ల నారుమడి దశలోనూ, మరికొన్ని ప్రాంతాలలో పిలకదశలోనూ ఉన్నాయి.

● అన్నదాతకు అదనపు వ్యయం..

జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరు ట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో మొగి పురుగు ప్రభావం అధికంగా ఉంది. ప్రతీ యేటా మొగి పురు ఉధృతి పెరుగుతోంది. రైతులు పంట మార్పిడి చేయడం లేదు. పొలం పూర్తిగా ఎండిపోకుండానే మళ్లీ సాగు ప్రారంభించడం, దుక్కి మందులో సల్ఫర్ అధికంగా వాడడంతో పొలాలు వదులై మొగి పురుగు ఉధృతి పెరుగుతోందని వ్యవసాయ నిపుణులు, అధికారులు అంటున్నారు. ప్రస్తుత యాసంగిలో వరి నారుమడులపైనే రెక్కల పురుగు ఉంటుంది. నివారణ కోసం పురుగు మందు పిచికారి వేసి కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేశారు. పురుగు పెట్టిన గుడ్లు ఎదిగి కాండం కింది భాగాన్ని తొలుస్తున్నాయి. తర్వాత దశలో కంకి తెల్లగా మారుతోంది. చివరికి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. పురుగు మందులకు అదనంగా వ్యవసాయ పె ట్టుబడులు పెడుతున్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం ఎక్కువవుతోం ది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.



మొగి పురుగుతో ఎర్రబారిన వరి



నివారణ చర్యలు తీసుకుంటేనే ఫలితం..

ఈ యాసంగిలో నారుమడి, పిలక దశల్లో మొగి పురుగు అధికంగా గమనించాం. నారుమడిలో 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3డి గుళికలు వేయాలి. నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయస్సున్న, పిలక దశలో ఉన్న వరి పైరులో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలి. అనంతరం వరి పంట చిరు పొట్ట దశలో ఉన్నప్పుడు రెక్కల పురుగు ఉధృతి గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం, ఎస్‌పి 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఐసోసైక్లోసిరమ్ 0.6 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.

- బలరాం, సీనియర్ శాస్త్రవేత్త, జగిత్యాల జిల్లా

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సమీక్ష

● సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లే ఆఫ్‌తో మూసివేసిన నిజాం షుగర్స్ కర్మాగారాలను పునరుద్ధరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీఎం పేషీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పరిచారు. నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో గల నిజాం షుగర్ పునరుద్ధరణ కోసం పరిశీలించాల్సిన అంశాలు, కొన్ని సంవత్సరాలుగా కర్మాగారాలు మూసివేసి ఉండడం వల్ల మిషనరీ పరిస్థితి, రైతుల ఆసక్తి, చెరుకు సాగు తదితర అంశాలపై పలు వివరాలను సేకరించారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఛైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలతో కలిసి సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిపారు. ఏ విధంగా నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపించాలి, ఆర్థిక పరిస్థితి, బకాయిల చెల్లింపు, మిషనరీ పునరుద్ధరణ, ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి, రైతులకు చేకూర్చాల్సిన మేలు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో చెరుకు రైతులకు తీపి కబురు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎన్నికల సందర్భంగా చెరుకు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారని వివరించారు.



సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 4: ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించవచ్చని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మశాలి కళ్యాణ భవనం వరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పద్మశాలి కల్యాణ భవనంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా సమస్యలతో కార్మికులు సతమతం అవుతూ కష్టాలను నష్టాలను ఓర్చుకుంటూ విద్యార్థులకు సేవలనందిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెకు వెళ్లడంతో అప్ప టి ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. వేయి రూపాయల నుంచి మూడు వేల రూపాయల వేతనా లు పెంచడానికి అంగీకరించిందన్నారు. ఎన్నికల సమయం కావడం వల్లే అప్పటి ప్రభుత్వం వేతనాలను పెంచుతామన్నారు తప్పా చిత్తశు ద్ధితో హామీనివ్వలేదని అర్థం అయిందన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్లకే వేతనాలు దిక్కులేదం టే గత ప్రభుత్వం అల్పాహారం అంటూ కార్మికులపై అదనపు భారం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యతతో పోరాటాలు చేస్తే తప్పా ఈ ప్రభుత్వాలు దిగిరావని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలలు తరబడి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతన చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, పెన్షన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రక టించిన కార్మికులకు గౌరవ వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు నిత్యావసర సరుకులు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం కార్మికులకు ప్రభుత్వం రెండు జతల యూనిఫాం ఇవ్వాలని అన్నారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, రాష్ట్ర నాయకుడు ధర్మల రామ్మూర్తి, జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మన్, జిల్లా ఉపాధ్యక్షులు పంతం రవి, లక్ష్మి, మహేశ్వరీ, మల్లవ్వ, కొమరవ్వ, సాయిలు, కొమరయ్య, హసీనాబేగం లావణ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వివిధ మండలాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

డబ్లింగ్ పనులతో పలు రైళ్ల రాకపోకలు రద్దు


పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మౌలాలి నుంచి సనత్‌నగర్ రైల్వే స్టేషన్ మధ్య డబ్లింగ్ పనులతో పాటు నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు పలు రైళ్లను రద్దుచేశారు. 17011/12 హైదరాబాద్ నాంపెల్లి నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. 12757/58 సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేశారు. 17233/34 నంబర్‌గల భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ నుంచి కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఈ రైలు కేవలం కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్యనే నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4: మండలంలోని డబ్బా గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఎలాలా రవికాంత్ రెడ్డి (45) మృతి చెందినట్లు ఎస్‌ఐ ఉమాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివ రాల ప్రకారం అమ్మక్కపేటకు చెందిన రవికాంత్‌రెడ్డి బైక్‌పై డబ్బ నుంచి అమ్మ క్కపేటకు వెళ్తున్నాడు. డబ్బ గ్రామానికి చెందిన గరికే ప్రసాద్ బైక్‌పై గ్రామ శి వారు నుంచి ఎదురుగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీ వ్ర గాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మాధ్యలో రవికాంత్‌రెడ్డి మృతి చెందాడు. ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా నిజామాబాద్ ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు. రవికాంత్‌రెడ్డికి ఇద్దరు కొడుకులు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెప్ప వాలని రాత్రి కవితా సంపుటికి జాతీయ పురస్కారం

- అవార్డు ఫలితాలు వెల్లడించిన రంగినేని ట్రస్ట్ కన్వీనర్ లక్ష్మణ్



అవార్డు పొందిన కవిత్వ సంకలనం, కవి వంశీకృష్ణ

సిరిసిల్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలను ప్రోత్సహిస్తూ ఉత్తమ సాహిత్యానికి బాటలు వేస్తున్న సిరిసిల్లకు చెందిన రంగినేని సుజాతమోహన్‌రావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతీ సంవత్సరం జాతీయస్థాయిలో అందిస్తున్న రంగినేని ఎల్లమ్మ జాతీయ సాహిత్యా పురస్కారం 2023 ఫలితాలను ట్రస్ట్ అధ్యక్షుడు రంగి నేని మోహన్‌రావు, అవార్డు కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ ఆదివారం వెల్లడించారు. ట్రస్ట్ ద్వారా ఒక సంవత్సరం కథాసంపుటికి, మరో సంవత్సరం కవితా సంపుటికి అవార్డులను అందిస్తున్నారు. 2023 సంవత్సరానికి పోటీకి వచ్చిన కవితా సంపుటిల్లో వరంగల్ జిల్లాకు చెందిన కవి, కథకుడు, విమర్శకుడు వంశీ కృష్ణ వెల్లడించిన రెప్ప వాలని రాత్రి కవితా సంపుటి ఎల్లమ్మ జాతీయ పురస్కారం దక్కించుకుంది. మార్చిలో ట్రస్ట్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. వరంగల్ జిల్లా గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన తాటికొండల వంశీ కృష్ణ సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. 1990 నుంచి రచన, వ్యాసాంగాన్ని ప్రారంభించి ఐదు కవిత్వ సంపుటాలు, రెండు కథ సంపుటాలు, రెండు సినిమా వ్యాస సంకలనాలు వెలువరించారు. కవిగా కాకుండా మంచి విమర్శకుడిగా కూడా తన రచనలను కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ సినీ విమర్శకుడి అవార్డును కూడా వంశీ అందుకున్నారు. రంగినేని జాతీయ పురస్కారానికి ఎంపికైన వంశీని పలువురు, రచయితలు, కవులు అభినందించారు.

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 4: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సమ్మక్క, సారలమ్మ జాతరను పురస్కరించుకుని రోజు రోజుకు ఆలయానికి భక్తుల రాక పెరుగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న క్షేత్రానికి తరలివచి ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. ఆదివారం తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ క్యూలైన్‌ల ద్వారా భక్తులు రాజన్న ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం భక్తులు శ్రీస్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. తదనంతరం అనుబంధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఆలయాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు బోనాలను నెత్తిలో పెట్టుకుని డప్పుచప్పుల్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, ఫిబ్రవరి 4: గంగాధర మండలం గర్శకుర్తిలో ఆదివారం మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

రాయికల్, ఫిబ్రవరి 4: రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ మహేందర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. లంచం కోసం వేధిస్తున్నారనే ఆరోపణలతో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సస్పెండ్ చేశారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో మ హేందర్ కోర్టు విధులు నిర్వర్తిస్తుంటారు. కానిస్టేబుల్ మహేందర్ ఓ కేసు విష యంలో తరచూ డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అల్లీపూర్ గ్రామానికి చెందిన రమేష్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. పూర్తి ఆధారాలు సమర్పిం చాడు. దీనిపై విచారణ చేసిన ఎస్పీ మహేందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హోటల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు



హోటల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 4: మున్సిపాలిటీలో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా వ్యవహరించి, అనుమతులు లేకుండా అనధికారికంగా ఆనంద్ భవన్ హోటల్ పేరుతో వ్యాపారంపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. ఆదివారం వేకువ జామునే పట్టణంలోని పార్క్ ఎదుట టౌన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఆనంద్ భవన్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఆనంద్ భవన్‌పేరుతో నడపబడుతున్న ఈ హోటల్ ఒప్పందానికి వ్యతిరేకంగా నడుపబడుతుందని, అందుకే ఈ హోటల్‌ను సీజ్ చేసి నట్లు తెలిపారు. ఇందులో పని చేస్తున్న సిబ్బంది, వారికి సంబంధించిన సామానులను భవనం నుంచి ఖాళీ చేయించామన్నారు. హోటల్ మూసివేసే క్రమంలో అన్ని విధాలుగా నిబంధనలు పాటించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వ హిస్తున్న ఈ హోటల్‌కు నోటీసులు అందించామని, నిర్వాహకుల నుంచి వచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేనందునే చర్యలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అయితే ఈ అంశంపై పలు పత్రికల్లో వార్తా కథనాలు రావడం, ప్రజలనుంచి అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, అనూహ్యంగా ఆదివారం వేకువజామునే సీజ్ చేయడం ప్రస్తుతం జగిత్యాల పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

పరిహారం కోసం పడిగాపులు

- 15 ఏళ్లుగా మిడ్‌మానేరు నిర్వాసితుల నిరీక్షణ
- గత ప్రభుత్వంలో పరిహారం చెల్లింపుపై నిర్లక్ష్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు



మానువాడలో నిర్మించిన మధ్య మానేరు జలాశయం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4: తమ సర్వస్వాన్ని ధారపోసి మధ్యమానేరు జలాశయానికి ఊపిరిపోసిన నిర్వసితులు పరిహారం కోసం పడిగాపులుకాస్తున్నారు. తమవిలువైన భూములు, తమ గొడ్డుగోద ఉపాధిని వదిలేసి పొట్టచేత పట్టుకుని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు పొట్టచేతబట్టుకుని ఉన్నఫలంగా తరలివచ్చారు. బోయినపల్లి మండలం మానువాడ వద్ద ఏర్పాటు చేసిన మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11 గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజి పల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008 సంవత్సరంలో 12 గ్రామాల్లో 10,683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ముంపునకు గురవుతున్న ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతోపాటు వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 సంవత్సరం నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10,683 కుటుంబాలకు గాను 10,044 కుటుంబాలకు మాత్రమే పరిహారం చెల్లించారు. మిగతా 639 మంది నిర్వాసిత కుటుంబాలకు 219 మంది కుటుంబాలకు చెందిన నిర్వాసితుల సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ. 20.22 కోట్లుతో నివేదికను ప్రభుత్వానికి అందించారు. మిగిలిన 420 మంది నిర్వాసిత కుటుంబాల్లో కొంత మంది కోర్టును ఆశ్రయించగా మరికొంత మంది వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ. 30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం వుందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తు 10 సంవత్సరాలు గడిచిన పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిర్వాసితుల పక్షాన నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితులు గంపెడు ఆశతో వున్నామని చెబుతున్నారు.

● 501 మంది యువతకు అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురవుతున్న నిర్వాసిత యువతి, యువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతీ ఒక్కరికి రెండు లక్షల రూపాయల పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3,917 మంది యువతను గుర్తించారు. అందులో యవతులు 2,303 మందికి గాను 1,879 మందికి రెండు లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89 మంది యువతల సంతకాలు మాత్రమే సేకరించారు. వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సివుంది. కాగా 1,614 మంది యువకులకు గాను 1,537 మందికి పరిహారం చెల్లించగా 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు వారికి ఇంక చెల్లించాల్సి ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు..

- నాగుల శంకరయ్య, సంకెపల్లి



వేములవాడ మండలం సంకెపల్లి గ్రామం మాది. తన ఇళ్లు ముంపునకు గురువుతుంది. అధికారులు వచ్చిన దరఖాస్తులు తీసుకువెళ్లారు. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితులపై శ్రద్ధ తీసుకుని పరిహారం త్వరగా ఇప్పించాలని కోరుతున్నాం.

సంతకాలు తీసుకున్నారు.. పరిహారం రాలేదు..

- జి జ్యోతి, రుద్రవరం, నిర్వాసిత యువతి



మాది రుద్రవరం గ్రామం. ప్రభుత్వం కటాఫ్ తేదీ ప్రకారం నేకు పరిహారం అందాల్సిఉంది. గ్రామపంచాయతీకి వచ్చి అధికారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సంతకాలు తీసుకుని వెళ్లారు. ఇప్పటి వరకు పరిహారం మాత్రం అందలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని పరిహారం అందజేయాలి.

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రా ధాన్యం ఇస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాము. ఎన్నికల సమయంలో నిర్వాసిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చాము. గ్రామా నికి ఒక్క ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి సమ స్యలను పరిష్కరిస్తాము. 15 రోజుల్లో నిర్వాసి తుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తాం. కంపెనీల ఏర్పాటుతో నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం.

'మహతి'లో వార్షికోత్సవ హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహతి డిగ్రీ కళాశాల విద్యార్థులు వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం సిరిసిల్ల సుభాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక రుగ్మతలపై విద్యార్థులు నృత్య, నాటక రూపాలను ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి రాజు మాట్లాడుతూ మహిళలు సాధికారితను పెంచేందుకు నాణ్యమైన ఉన్నత విద్యను మాధ్యమంగా చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నూతన విద్యా సంవత్సరం నుంచి ప్రొఫెషనల్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గెంట్యాల భూమేష్, అధ్యాపకులు రాజేందర్, వేణుగోపాల్, లక్ష్మీ, శరత్ బాబు, స్వామి, చక్రపాణి, స్వప్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక ప్రార్థనలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని దర్గాలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని వేడుతూ ఆ పార్టీ నాయకులు నేవూరి సంతోష్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డిలు మొక్కులు మొక్కారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, తిరుపతి, లింగాగౌడ్, మల్లారెడ్డి, బాబు, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, రఫీక్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: మండలంలోని పదిర గ్రామంలో కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో కార్మికులు, రైతులు, కూలీలకు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు అరుణ్‌కుమార్ నేతృత్వంలోని వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి మందును పంపిణీ చేశారు. కార్మికులు సంపూర్ణ ఆరోగ్యం కోసం వివిధ రకాల పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మంజుల భార్గవి, పంచాయతీ కార్యదర్శి సారిక, ఎంపీటీసీ మల్లేశం, కాంగ్రెస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్ఎం స్వప్న, ఆశా కార్యకర్త పద్మ, నాయకులు ఎల్లయ్య, నాగరాజు, వెంకటరెడ్డి, రాజు, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాయిలు, కార్మిక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 4: పరీక్షలంటే భయపడకుండా ఇష్టంతో చదివి, కష్టపడి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు పదో తరగతి విద్యార్థులు కృషి చేయాలని మోటివేషనల్ స్పీకర్ ఎర్ర ప్రవీణ్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంసిద్ధత, కేరీయర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయుల మార్గనిర్దేశనంతో లక్ష్య సాధన వైపు సత్ప్రవర్తనతో కూడిన జీవిత ప్రయాణాన్ని పదోతరగతి విద్యార్థులు సాగించాలని అన్నారు. అమ్మ త్యాగాన్ని, నాన్న కష్టాన్ని గుర్తించిన వారు భవిష్యత్తులో మీరు చేరుకున్న లక్ష్యాన్ని చూసి గర్వపడేలా కృషి ఉండాలన్నారు. పరీక్షలంటే ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని పరీక్షల సమయంలో చదువుతో పాటు తగినంత నిద్ర, సరైన సమయానికి ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. చెడు వ్యసనాలతో పాటు ఇతరత్రా కార్యక్రమాలపై దృష్టి సారించకుండా పరీక్షలపైనే దృష్టిని కేంద్రీకరించి 10జీపీఏను సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోమాల లచ్చయ్య, గన్నమనేని శ్రీనివాసరావు తదతరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని చిత్రపటాలు పంపిణీ

కోనరావుపేట, ఫిబ్రవరి 4: కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో ఆదివారం అయోధ్య రాముని చిత్ర పటాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోనరావుపేట సింగిల్‌విండో వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, బేంద్రే శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ, సీఐ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 4: క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, సీఐ సదన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రేపాక గ్రామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పోటీలు నిర్వహించడం ద్వారా అనేక మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఆటల ద్వారా నేడు ఉపాధి అవకాశాలు మెరుగు అయ్యాయని తెలిపారు. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండి ఆటలపై దృష్టి నిలుపాలన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాలలోను రిజర్వేషన్ ఉంటుందన్నారు. క్రీడల వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పాఠశాల స్థాయిలోనే ఆటలు నేర్చుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజం అని, పోటీలలో పాల్గొనడమే ప్రధానం కావాలన్నారు. పోటీలు నిర్వహించిన వారికి అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం, ఎస్సై దాస సుధాకర్, నాయకులు గుర్రం భూపతిరెడ్డి, కొలుపుల లక్ష్మన్, సింగిరెడ్డి రమణారెడ్డి దయాసాగర్, రమేష్ లతో పాటు నిర్వాహకులు, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించిన సర్పంచ్‌లు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 4: గ్రామాలలో సమస్యల పరిష్కారంలో సర్పంచ్‌లు కీలకంగా వ్యవహరించారని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జవారిపేట సర్పంచ్ అన్నాడి కరుణరవీందర్‌రెడ్డి సన్మాన సభ ఆదివారం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవారిపేట గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉన్న వారిని ప్రజలు గుర్తించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లయ్య, మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, గజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాస్కర్, లింగయ్య, మల్లారెడ్డి, నిర్సింహారెడ్డి, సంతోష్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో వివిధ కుల , యువజన సంఘాల ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులను ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ఐదేళ్లలో గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. పదవులు లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌రజిత శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ హనుమంతు, మాజీ వార్డు సభ్యులు, ఆయా కుల, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు

వేములవాడ టౌన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని తాజా మాజీ గ్రామపంచాయతీ పాలకవర్గానికి సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, ఎంపిటీసీ గాలిపెల్లి సువర్ణస్వామిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులను ఘనంగా శాలువాలతో సన్మానించగా పారిశుద్య కార్మికులకు నూతన బట్టలను అందజేసి సన్మానించారు. గ్రామానికి నూతనంగా వచ్చిన ఇంచార్జ్ పవనకుమారిని, కార్యదర్శి దిలీప్‌రెడ్డిని సైతం ఘనంగా సన్మానించి సత్కరించారు. అంతే కాకుండా గ్రామంలోని పలు కుల సంఘాలు పలవురు వ్యక్తులు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాడెం శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ పిల్లి కనుకయ్య, నాయకులు కత్తి కనుకయ్య, వంకాయల భూమయ్య, పడిగెల మహేష్, తునికి నర్సయ్య, నడిగొట్ల హరికృష్ణ, అలువాల పర్శరాములు, వంకాయల రాజశేఖర్, కైస మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనదారులకు మరోసారి వెసులుబాటు

- ఇప్పటి వరకు రూ. 1.19కోట్లు వసూళ్లు - 1,82,018 చాలన్స్ చెల్లింపులు - పెండింగ్ ఈ-చాలన్స్ 1,87,996

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 4: వాహనదారులకు మరోసారి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. జిల్లాలో వాహనాల ఈ-చాలన్స్ జరిమానాల చెల్లింపునకు గడువు ఈనెల 15వరకు పెంచారు. దీంతో వాహనదారులు పెండింగ్ చాలన్స్ జరిమానాలు చెల్లించేందుకు అవకాశం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 3,70,014 వాహనాలకు పెండింగ్ ఈ- చాలన్స్ ఉండేవి. జిల్లాలో రాయితీ లేకుండా ట్రాఫిక్ ఈ-చాలన్స్ ద్వారా బకాయిలు 10కోట్ల ఐదు లక్షల50వేల 195రూపాయలు చెల్లించాల్సి ఉండేది. మెగా డిస్కౌంట్ మేళా ద్వారా 35రోజుల్లో 1,82,018 చాలన్స్ ద్వారా రూ. 1.19కోట్లు వసూలయ్యాయి. మిగితా 1,87,996 ఈ-చాలన్స్ ద్వారా జరిమానాల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

● వాహనదారుల నుంచి విశేష స్పందన..

భారీ రాయితీ ద్వారా ఈ-చాలన్స్ జరిమానాల చెల్లింపునకు వాహనదారుల నుంచి విశేష స్పందన లభించింది. డిసెంబరు 26నుంచి జనవరి 10వరకు మొదటి విడత మెగా డిస్కౌంట్ మేళాకు గడువు



జరిమానాలు వేస్తున్న పోలీసులు(ఫైల్)

విధించింది. అయినప్పటికీ పెండింగ్ ఈ-చాలన్స్ ఇంకా ఉండడంతో మళ్లీ రెండో విడత జనవరి 31వరకు గడువు పెంచింది. దీంతో వాహనదారులు డిస్కౌంట్ మేళాను వినియోగించుకునే వెసులుబాటు కలిగింది. మేళాలో ద్విచక్రవాహనాలకు 80శాతం, కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాలకు 60శాతం, ఆర్టీసీ వాహనాలకు 90శాతం రాయితీ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ-చాలన్స్ చెల్లింపులకు భారీ రాయితీ ప్రకటించడంతో 31 రోజుల్లో 55 శాతం వాహనదారులు భారీ రాయితీ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ప్రభుత్వం భారీ రాయితీ గడువు మళ్లీ పెంచడంతో వాహనదారులకు పెండింగ్ చాలన్స్ చెల్లించే అవకాశం దక్కింది.

● డిస్కౌంట్ మేళాకు స్పందన బాగుంది

- అఖిల్ మహజన్ , ఎస్పీ



డిస్కౌంట్ మేళాలో ఈ-చాలన్స్ చెల్లింపులకు వాహనదారుల స్పందన బాగుంది. జిల్లా వ్యాప్తంగా 55 శాతం వాహనదారులు జరిమానాలు చెల్లించారు. మిగితా 45శాతం వాహనదారులు చెల్లించాల్సి ఉంది. ఇక మళ్లీ గడువు పెంచడం వల్ల మిగితా వాహనదారులు డిస్కౌంట్ మేళా చాన్స్ వినియోగించుకునే అవకాశం నెలకొంది.

విద్యార్థికి సన్మానం

రుద్రంగి, ఫిబ్రవరి 4: సాంఘికశాస్త్ర టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో రుద్రంగి మండలం మానాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గుర్రపు అజయ్ మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టుకు ఎంపిక కావడంతో ఆదివారం మానాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ సర్పంచ్ అల్లూరి మానస, వీడీసీ చైర్మన్ రవీందర్ ఆధ్వర్యంలో విద్యార్థి గుర్రపు అజయ్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తూమ్ జలపతి, జక్కు మోహన్, జక్కు వంశి, లక్ష్మణ్, దీలీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కోనరావుపేట, ఫిబ్రవరి 4: మండలంలోని కోలనూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు మేరుగు అంజనేయులుకు తోటి స్నేహితులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆంజనేయుని తండ్రి రాములు కూడా పక్షవాతంతో బాధపడుతున్నాడు. తల్లి కూలిపని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఆమె కూడా ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. దీంతో వీధిన పడ్డ కుటుంబానికి మేము ఉన్నామంటు అంజనేయులు స్నేహితులు తక్షణ సహాయం కింద పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తోటి స్నేహితులు నాగరాజు, నరేష్, కనకయ్య, బాబు, రాకేష్, మహేష్, అనిల్, సంధ్య, శిరీష, లావణ్య, దివ్య, అపర్ణ, మమత, జమున, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సన్మానం

చందుర్తి, ఫిబ్రవరి 4: రాజన్న సిరిసిల్లా జిల్లా కోర్టులో ఫోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామకమైన పెంట శ్రీనివాస్ ను తన బాల్య మిత్రులు ఆదివారం చందుర్తి ప్రాథమిక పాఠశాలలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన బాల్య మిత్రులు తనకు సన్మానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేడికాల అంజయ్య, మరాఠీ దామోదర్, ఉప్పుల మహేశ్, అంజిబాబు, పోతరాజు రవి, ఎడ్ల వెంకటేశం, కట్ట రాములు, కత్తి రాజుగౌడ్, రవితేజ, మేడిశెట్టి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన గౌడ సంఘం నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గౌడ సంఘం నాయకులు ఆదివారం కలిశారు. ఈ నెల 11న మంత్రి పొన్నంకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని నిర్వహించే ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్, నాయకులు నారాయణగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, వేణుగౌడ్, సాయిరాంగౌడ్ తదితరులు ఉన్నారు.

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు

- హామీల అమలుపై ప్రజలను సన్నద్ధం చేస్తాం - మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

గంభీరావుపేట, ఫిబ్రవరి 4: అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ వ్యాఖ్యానించారు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లకు, ఉపసర్పంచ్‌లకు. వార్డు సభ్యులకు ఆదివారం ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించలేదని, ప్రజలను తప్పుదోవ పట్టించిన కాంగ్రెస్ పార్టీ ఓడించిందన్నారు. హామీల అమలు కోసం ప్రజలను ఎప్పటికప్పుడు సన్నద్ధం చేస్తామన్నారు. ఆసరా పింఛన్ ఉన్న ఇంట్లో మహాలక్ష్మి పథకం వర్తించదనే ప్రణాళికను కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.

● ప్రజాసేవలో ఉండటం గొప్పతనం..

పదువులు లేకున్నా ప్రజాసేవలో ఉండటం గొప్పతనమని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. తన స్వగ్రామమైన గజసింగవరంలో కొండూరు రవీందర్‌రావు మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శాలువాలతో



మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న రవీందర్‌రావు

సత్కరించి, ఘనంగా సన్మానించారు. ప్రజా స్వామ్యంలో పదవులు వస్తుంటాయి.. పోతుంటాయని కానీ చేసిన అబివృద్ధి పనులు శాస్వతంగా గుర్తుంటాయన్నారు. మండలంలో అన్ని గ్రామాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో అబివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 4: గ్రామీణ ప్రాంత యువతను అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తంగళ్లపల్లి మండలం రాళ్లపేట గ్రామంలో జడ్పీటీసీ పుర్మాణి మంజులలింగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తున్న జడ్పీటీసీ మంజులతో పాటు నాయకులు పుర్మాణి లింగారెడ్డి, జల్లం ప్రవీణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సూర దేవరాజ్, వైద్య శివప్రసాద్, జల్లం ప్రవీణ్, పుర్మాణి లింగారెడ్డి, మాజీ సర్పంచ్ బాలసాని పర్శరాములు, మునిగెల రాజు. కట్కం రాజశేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిక..

రాళ్లపేట గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. యువతకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

సక్రమంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపైన ఉందన్నారు.

● ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం..

తంగళ్లపల్లి ఫ్రెండ్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎడ్మాల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సామాల గణేశ్, కోశాధికారి జుకంటి శంకర్, సాంస్కృతిక కార్యదర్శి ముక్క శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, లింగాల భూపతి, మోర రాజు, నగరం సత్యనారాయణరెడ్డి, సామాల వెంకటేశం, కోడం చందు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా చౌడలమ్మ కల్యాణం



బోనాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

ముస్తాబాద్, ఫిబ్రవరి 4: మండలంలోని బందనకల్‌లో చౌడలమ్మ కల్యాణ మహోత్సవాన్ని యాదవ సామాజికవర్గం సభ్యులు కన్నుల పండువగా నిర్వహించారు. లగ్గం బోనాలు తీసిన అనంతరం ఆదివారం చౌడలమ్మ, దేశపతిరాజు కల్యాణ మహోత్సవాన్ని భక్తుల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు లగ్గం పట్నాలు వేశారు. శివసత్తుల పూనకాల మధ్య వేడుకలను నిర్వహించారు. కట్నకానుకలు సమర్పించుకున్నారు. సోమవారం నాగవెల్లి పట్నం వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గం సభ్యులు రాయం ముత్యం, బాలయ్య, ఐలయ్య, బాలెల్లు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

వీర్నపల్లి: ఫిబ్రవరి 4: మండలంలోని కంచర్ల గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాలను ముదిరాజ్ కులస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని బైండ్ల వారి ఆటపాటలు, డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు సమర్పించారు.

జాతీయ పురస్కారాలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: మండల కేంద్రానికి చెందిన రమేశ్, అనిల్ యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాలను అందుకున్నారు. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని స్వచ్ఛంద సంస్థ వివిధ రంగాల్లో చేసిన సేవలను గుర్తించి ఆదివారం హనుమకొండలో పురస్కారాలను అందజేసింది. పర్యావరణాన్ని కాపాడుతూ మొక్కలు పంపిణీకి చేసిన సేవలను గుర్తించి రమేశ్‌కు విరాట్ విశ్వకర్మ సేవా రత్న, అయోధ్య రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గుమ్మడి కాయ, క్యారెట్‌తో రామ మందిరాన్ని తయారు చేసిన కార్వింగ్ కళాకారుడు అనిల్‌కు విశిష్ట స్ఫూర్తి చిత్ర కళారత్న జాతీయ పురస్కారంతో సత్కరించింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, స్వచ్ఛంద సేవా సమితి చైర్మన్ మోహన్‌రావు, కో-ఆర్డినేటర్ రాజుకుమార్ చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నారు. జాతీయ పురస్కారాలు అందుకోవడంపై ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 4: చిన్నప్పుడు కలిసి చదువుకున్న 80 మంది స్నేహితులంతా ఒకే వేదికపై కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో 1987-88సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరు ఆదివారం పట్టణంలోని ఓ పంక్షన్ హాల్‌లో కలిసి చదువు చెప్పిన గురువులు రామస్వామి, రాజయ్య, సుదర్శన్, అశోక్‌రావు, రమాదేవిలను సన్మానం చేసి సత్కరించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను



సుద్దాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



సిరిసిల్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నేమరవేసుకుని భవిష్యత్తులో అందరూ కలిసి ఉండాలని నిర్ణయించుకోన్నారు. కార్యక్రమంలో గాజుల శ్రీనివాస్, పిస్క మధు, గెంట్యాల భూమేష్, రామకృష్ణ, కొండ ప్రసాద్, వంకాల కార్తీక్, శ్రీనివాస్, కుమార్‌రాజ్, గౌడ సురేష్, చందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం సుద్దాల ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్దులు ఆదివారం కలుసుకోని తమ పాత జ్ఞాపకాలు నేమరువేసుకున్నారు. సుద్దాల ప్రభుత్వ పాఠశాలలో 2009-2010 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్దులు సుద్దాలలో కలుసుకోని తమ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటు సంతోషంగా గడిపారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు



చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. చేతికి అందే ఎత్తులో ఉండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులకు కనిపించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సెస్ అధికారులు స్పందించాలని, వేలాడుతున్న తీగలను సరి చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు.

అసంపూర్తిగా పార్కుపనులు.. ఎండిన మొక్కలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులో చేపట్టిన అర్బన్ పార్కు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పచ్చదనం పంచేందుకు సంబంధిత శాఖ అధికారులు పార్కులో నాటిన వేలాది మొక్కలు ఎండిపోయాయి. నాటడంపై చూపిన శ్రద్ధ సంరక్షణలో మరిచారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాటిన మొక్కలు ఎదిగేందుకు బిగించిన ఊత కర్రలు మాత్రమే దర్శనమిస్తున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా మొక్కల సంరక్షణపై ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఎండిపోయిన మొక్కలు

దశలవారీగా అభివృద్ధి పనులు



ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్

చందుర్తి, ఫిబ్రవరి 4: దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం రామారావుపల్లెలో బీరప్ప ఆలయం వద్ద సీడీపీ నిధులు లక్షా 50 వేల రూపాయలతో వేసిన బోరు మోటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ బోర్ మోటర్‌కు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు అజయ్‌రెడ్డి, నాగిరెడ్డి, పెద్ది బీరయ్య, తిరుపతి, మోహన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.